నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 31 జులై 2023

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-తాడ్వాయి

సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివారం తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు సైబర్ నేరాలపై యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోసపూరిత ప్రకటనలు ఆన్‌లైన్ వచ్చిన వాటిని నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. అంగతకులు ఆన్‌లైన్‌లు డబ్బులు పంపాలంటే ఎట్టి పరిస్థితిలో పంపకూడదని అలాగే ఓటీపీలు షేర్ చేయకూడదని సూచించారు.

బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక


కండువాలు కప్పుతున్న

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు జుక్కల్ ఎమ్మెలే హన్మంత్ షిండే సమక్షంలో బీజేపీ నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఆదివారం వారికి ఎమ్మెల్యే షిండే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే హన్మంత్ షిండే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన బస్వాపూర్ గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ శివానంద్, మాజీ విండో చైర్మన్ రాజు పటేల్, మ్యెగులాజీ, జైపాల్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ @ కులసంఘాలు




అధికార పార్టీ దూకుడు

- కుల సంఘాలకు నిధుల జాతర
- ఎన్నికల ముందు మరో ఎత్తుగడ

అధికార బీఆర్ఎస్ పార్టీ విపక్ష పార్టీల కంటే ముందుగానే ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఎన్నికల సమయానికి ఎలాంటి అవరోధాలు లేకుండా సునాయసంగా గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. అందులో భాగంగా తమ అమ్ములపొద నుంచి ఒక్కో అస్త్రాన్ని ముందుకు తీసుకొస్తోంది. ఆత్మీయ సమ్మేళనాలు, అభివృద్ధి కార్యక్రమాల పూర్తయిన తరువాత ప్రస్తుతం కుల సంఘాలను టార్గెట్ చేస్తోంది. ఆయా నియోజకవర్గంలో అన్ని సామాజిక తరగతులకు భవనాలకు నిధులు మంజూరు చేస్తోంది. మంత్రి, ఎమ్మెల్యేలు స్వయంగా ప్రొసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను అందజేస్తున్నారు. ఎన్నికల సమయంలో నిధుల ఉత్తర్వులు జారీ చేస్తే అది ఎన్నికల కోడ్ ఉల్లంఘన అవుతోంది. ఈ నేపథ్యంలో ఆర్డర్స్ కాపీలు ఇప్పుడు అందజేసి ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిధులు విడుదల చేసేలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆ సమయంలో నిధులు విడుదల చేస్తే ఆయా సామాజిక తరగతుల ఓట్లు సాధించుకోవచ్చనేది ప్రధాన లక్ష్యం.

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల యేడాది కావడంతో అధికార బీఆర్ఎస్ పార్టీ ఏ అవకాశాన్ని జార విడుచుకోవడం లేదు. వ్యూహాత్మకంగా ఒక్కో అడుగు వేస్తూ విపక్షాలకు షాక్‌లు ఇస్తోంది. ఎన్నికల నేపథ్యంలో పార్టీలు అసంతృప్తుల ను బుజ్జగించేందుకు మొదట ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో అసంతృప్తిగా ఉన్న ద్వితియశ్రేణి నాయకులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేసింది. ఈ సమ్మేళనాలు సానుకూల ఫలితాలు ఇచ్చాయి. 'తమ నాయకుడు పట్టించుకోవడం లేదు' అన్న అసంతృప్తిలో ఉన్న నాయకుల్లోనూ కొంత సానుకూల మార్పు వచ్చింది. ఈ సమ్మేళనాల తరువాత సీఎం క్రికెట్ కప్ పేరిట యువతకు దగ్గరయ్యేందుకు పోటీలు నిర్వహించారు. అధికార పార్టీ స్వయంగా పోటీలు నిర్వహించడం, అన్ని మండలాల్లో క్రీడలు సాగడంతో యువతలో పెద్దఎత్తున బీఆర్ఎస్ పట్ల చర్చకు దారితీసింది. ఇదే సమయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట ఇప్పటి వరకు ఆయా నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఏకరువు పెట్టారు. పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఇవన్నీ కూడా అధికార పార్టీ పట్ల ప్రజల్లో నిత్యం చర్చ జరిగేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఏ నోట విన్నా బీఆర్ఎస్ పార్టీ తప్ప మరో పార్టీ పేరు లేకుండా చేయడంలో విజయవంతమయ్యారు. ఆ తరువాత ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయిస్తామని దరఖాస్తులు ఆహ్వానించింది. సాధారణంగా 18 సంవత్సరాలు నిండిన ఓటు హక్కు ఉన్న యువతకు మాత్రమే లైసెన్స్‌లు జారీ అవుతాయి. ఈ నేపథ్యంలో పార్టీగా దగ్గరుండి లైసెన్స్‌లు జారీ చేయిస్తే వారంతా ఎన్నికల్లో పార్టీకి అనుకూల తీర్పు ఇస్తారని వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఇక ఇటీవల వచ్చిన వరదల్లోనూ స్వయంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కాన్వయ్ వదిలి పోలీసు వాహనంలోనే అన్ని ప్రాంతాలను కలియతిరగడం



పార్టీకి బూస్ట్ వచ్చింది. వరదల సమయంలో ఏ పార్టీ నేతలు కూడా బయట అడుగు పెట్టింది లేదు. ఇవన్నీ ఇలా కొనసాగుతుండగా.. బీఆర్ఎస్ మరో బాణం ఎక్కుపెట్టింది.

కుల సంఘాలకు తాయిలాలు...

ఎన్నికల్లో గెలుపోటముల్లో కుల సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆయా నియోజకవర్గా ల్లో కుల పెద్దలు తీర్మానాలు చేసి మరీ ఫలానా వ్యక్తికి ఓటు వేయాలని ప్రకటిం చిన సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం కుల సంఘాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయిస్తు న్నారు. ఇటీవల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన నియోజక వర్గంలో 26 కుల సంఘాలకు కోటీ పది లక్షల ప్రొసిడింగ్స్ ఆర్డర్స్ అందజేశారు. రూరల్ నియోజకవర్గంలో ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు రూ.50 లక్షల ప్రొసిడింగ్స్ ఆర్డర్స్ అందజేశారు.

తరలుతున్న కార్యాలయాలు

- ఇప్పటికే వెళ్లిపోయిన ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌డబ్ల్యూ,
- ఆర్‌అండ్‌బీ, బీఎస్ఎన్ఎల్ శాఖల ఆఫీస్‌లు
- వెనక్కు రప్పించాలని స్థానికుల డిమాండ్



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రం తాలూకాగా ఉన్న సమయంలో ఏర్పాటు అయిన ప్రభుత్వ రంగ కార్యాలయాలు క్రమంగా తరలిపోతుండటంతో వెనక్కు రప్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మద్నూర్ పాత తాలూకా కేంద్రంగా ఉన్న సమయంలో ఏర్పాటు అయిన ఆర్డబ్ల్యూఎస్ శాఖ, ఎస్ డబ్ల్యూ ఓ శాఖలు ఉన్న వాటిని వేరే మండలాలకు తరలించారు. ఒకొక్కటిగా పలు శాఖల కార్యాలయాలు తరలివెళ్తున్నాయి. తాజాగా ఆర్అండ్‌బి శాఖ, బిఎస్ఎన్ఎల్ శాఖ కార్యాలయాన్ని సైతం బిచ్కుందకు తరలిస్తున్నారు. ఇలా ఒకటి ఒకటిగా మద్నూరు మండల కేంద్రంలో గల తాలూకా కార్యాలయాలు అన్ని బిచ్కుందకు తరలించడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరలించిన కార్యాలయాలు వెంటనే మద్నూరుకు తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మద్నూర్ డిగ్రీ కాలేజీ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హన్మంత్ షిండే రానున్న నేపథ్యంలో కార్యాలయాలను వెనక్కు తీసుకురావాలని కోరనున్నట్టు స్థానికులు పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో మరింతగా అభివృద్ధి పరచవలసిన అవసరం ఉంటే ఉన్న కార్యాలయాలను తరలించడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. ఎస్‌టీవో కార్యాలయాన్ని సైతం తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాత తాలూకా కేంద్రాన్ని డివిజనల్ కేంద్రంగా మార్చవలసి ఉండగా బిచ్కుందకు కార్యాలయాలన్నీ తరలిస్తూ దాన్నే డివిజనల్ కేంద్రంగా ఏర్పాటుకు యత్నిస్తున్నట్టు ఆరోపనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రీయ విద్యాలయం కూడా మద్నూర్‌కు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రజల్లో ఆరోపణలు వినబడుతున్నాయి.

ఎమ్మెల్యే హనుమంతు షిండే చిన్నతనం నుండి మద్నూర్ లోనే ఉంటూ పదో తరగతి వరకు ఇక్కడే చదువుకొని ఉన్నత చదువులకు వెళ్లారు. తరలిపోయిన కార్యాలయాలకు వెంటనే మద్నూర్‌కు రప్పించాలని ఎమ్మెల్యేను మండల వాసులు కోరుతున్నారు.

నేడే జీపీ కార్మికుల చలో కలెక్టరేట్

- విజయవంతం చేయాలి : కార్మిక సంఘాల జేఏసీ


సమ్మెలో భాగంగా శిబిరంలో నినాదాలు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించానలి డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు నేడు(సోమవారం) చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని మండల పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు సుభాష్ కోరారు. మండల పరిషత్ కార్యాలయం ముందు గల ఆర్ అండ్ బి రోడ్డుపై కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 25 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వము ఉదాసీన వైఖరి అవలంబిస్తుందని అన్నారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనముతో పంచాయతీలలో పేరుకుపోయిన చెత్తాచెదారంతోపాటు మురికి కాల్వల , వీధులలో దుర్గంధ భరితమైన వాసనను సైతం భరిస్తూ అనారోగ్యము పాలైనప్పటికీ కుటుంబ పోషణ నిమిత్తం కాలమెల్ల తీస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ సాయిలు, బాలమణి, పత్తి నరసమ్మ, పత్తి సుశీల , నరసమ్మ , ఆరేటి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

- ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వాహన దారులు, ఆటోవాలలు ట్రాఫిక్ రూల్స్ ని ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫ్రూట్ మార్కెట్లో టాటా ఏస్ యూనియన్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా వుంటుందని, అందుకు కారణం వాహనాలు పెరగడమేనన్నారు. వాహనదారులు, ఆటోవాల ట్రఫిక్ రూల్స్ ను పాటించినట్టైయితే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఆటోవాలలు లైసెన్సు, ఫిట్ నెస్, ఇన్సూరెన్స్, యనిఫాం కలిగి ఉండాలని తెలిపారు. నగరంలో రోడ్డు నిభందనలను పాటించనట్లయితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రీష్ ఖాన్ మాట్లాడతూ ట్రాఫిక్ నిభందనలను తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పోరేటర్ ఎం.డి. రియాజ్, యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ జమిల్, కార్యదర్శి మహ్మద్ సమి, ఉపాధ్యక్షులు సయ్యద్ గఫార్, జాయింట్ కార్యదర్శి అబ్దుల్ మన్నన్ వాహనాదారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా


మాట్లాడుతున్న చైర్మన్ దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన యూరియా అందుబా టులో ఉంచామని లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివార మిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని పోతాయిపల్లి, కోమటిపల్లి, సూరాయిపల్లి, లింగంపల్లి, శెట్టిపల్లి, పరమల్ల, మంబోజీపేట్, భవానిపేట్, రాంపూర్, మేంగారం గ్రామాల్లోని రైతులకు అవసరమైనటువంటి 3,500 బస్తాల యూరియాను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అవసరమైన రైతులు పట్టా పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చి సిబ్బందికి అందజేసి యూరియాను తీసుకోవాలని సూచించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నవతెలంగాణ-గాంధారి

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గాంధారి ఎస్ఐ డి.సుధాకర్ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన చోటే నేరాలు ఎక్కువ జరుగుతున్నాయని తద్వారా సమాజానికి కీడు జరుగుతుందని అన్నారు. ఆదివారం గాంధారి బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై కేసు నమోదు చేశారు. సరైనా ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాల తనిఖీల లో ఏఎస్సై గంగారాం, కానిస్టేబుల్ లు యాదగిరి, భాను, సిబ్బంది మోతీలాల్, విఠల్ లు పాల్గొన్నారు

దళితులకు సేవ.. బాధ్యత

- దళితవాడల అభివృద్ధికి నిధులు
- పలు ప్రారంభోత్సవాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ

'బాన్సువాడ దళితులతో 1978 నుండి అనుబంధం ఉన్నది. నా రాజకీయ ప్రయాణంలో మొదటినుండి దళితులు నా వెంటనే నడుస్తున్నారు. వారికి సేవ చేయడం నా బాధ్యత. గతంలో నిధులు సరిగ్గా రాక పనులు చేయలేక పోయాను. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వచ్చాక వారి అభివృద్ధికి కావాల్సినన్ని నిధులు మంజూరు అవుతున్నాయని' స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ పురపాలక సంఘం పరిధిలోని పాత బాన్సువాడ దళిత వాడలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు స్పీకర్ పోచారం చేపట్టారు. వినాయక నగర్ లో రూ. 18 లక్షలతో ఏర్పాటు చేసిన పీఎస్ఆర్ పార్క్ ప్రారంభించారు. దళితవాడలో రూ. 20 లక్షలతో నిర్మించే దండోరా ఫంక్షన్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీనివాస ఫంక్షన్ హాల్ వద్ద రూ. 15 లక్షలతో నిర్మించిన వంటశాల ప్రారంభించారు. రూ. 36.30 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రారంభించారు. గృహలక్ష్మీ పథకంలో రూ. 3 లక్షలతో నిర్మించే 40 ఇళ్ళకు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. 'బాన్సువాడలోని దళితవాడ గతంలో పాత ఇళ్ళతో, బురద వీదులతో ఇబ్బందిగా ఉండేది. అభివృద్ధి లో భాగంగా దళితవాడ కోసం అవసరమైన నిధులను ప్రత్యేకంగా మంజూరు చేశాను. ఇప్పటికే 176 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యి, లబ్ధిదారులు గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఇప్పుడు దళిత కాలనీలో అన్ని కొత్తగా నిర్మించిన డబుల్ బెడ్ ఇండ్లు, వాటర్ ట్యాంక్, సైడ్ డ్రైనేజీలు, సిసీ రోడ్లతో పరిసరాలు పరిశుభ్రంగా మారి బంజారాహిల్స్ లాగా ఉన్నది. దళితవాడలో ఇప్పటికే మెజారిటీ కుటుంబాలకు స్వంత ఇల్లు సమకూరింది. మరో నలభై మందికి కూడా రూ. 3 లక్షల గృహలక్ష్మీ పథకం కింద మంజూరు చేశారు. ఇంకా ఎవరైనా ఇల్లు కావాలని అడిగితే తక్షణమే మంజూరు చేయడానికి సిద్దంగా ఉన్నాను. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళు అత్యధికంగా మంజూరు అయిన నియోజకవర్గం బాన్సువాడ. మొత్తం 11,000 ఇళ్ళు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలో ఇళ్ళు లేని ప్రతి పేదవారి స్వంత ఇంటి కలను నిజం చేయడమే నా లక్ష్యం. బాన్సువాడ లో మహిళలు, పిల్లల కోసం ప్రత్యేకంగా రూ. 20 కోట్లతో 100 పడకల మాతా-శిశు ఆసుపత్రి నిర్మించాం. పేదరికంలో ఉన్న గర్భవతులకు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పెడుతున్నాం. బలం కోసం న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్నారు. డెలివరీ అయిన తరువాత తల్లి, బిడ్డ లకు అవసరమైన వస్తువులతో కేసీఆర్ కిట్ అందజేస్తున్నాం. కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు వంటి పథకాలు ఉన్నాయి. మంచి చేసే వారిని ప్రజలు కాపాడుకోవాల'ని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్‌డీవో భుజంగరావు, సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణా రెడ్డి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం

పంట నష్టం పరిహారం ఏ ఒక్క రైతుకూ అందలే


మాట్లాడుతున్న డీకే అరుణ

- నిధులను పంజాబ్‌కు తీసుకెళ్లారు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది రూపాయలు తీసుకుని పోయి పంజాబ్ రైతులకు ఇస్తున్నారని, ఇక్కడ తెలంగాణ రైతాంగానికి మాత్రం పంట నష్ట పరిహారం చెల్లించడానికి రావడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున పంట నష్టం, ఆస్తి నష్టం ప్రాణ నష్టం, పశు సంపద నష్టం అని అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి అని అన్నారు. వేల్పూర్ మండలంలో మోతే గ్రామాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయన దత్తత తీసుకున్నారని, పెద్ద ఎత్తున చెక్ డ్యామ్ లు గ్రామంలో నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని ఎత్తి చూపారు. నాసిరక నిర్మాణాలతో వరుసగా మూడవసారి ఆ ప్రాంతం రైతులు 600 నుంచి 800 ఎకరాల పంట నష్టం పోయారు అని అన్నారు. ముఖ్యమంత్రి శిష్యుడు ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో కేవలం కమిషన్ల కోసమే డ్యామ్ నిర్మించారు అని, చెక్ డ్యామ్‌లకు ముందు రెండు పంటలు పండించుకునేవారు అని, ఇప్పుడు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పంట నష్టం జరుగుతుందని రైతులు తెలిపారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి కోట్లు తీసుకుని పోయి పంజాబ్ రైతులకు ఇస్తున్నారు అని, ఇక్కడ తెలంగాణ రైతాంగం కనిపించడం లేదా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్పాల్ సూర్య నారాయణ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ కులచారి దినేష్ కుమార్, బిజెపి జిల్లా కార్యదర్శి న్యాలం రాజు, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ మేడపాటి ప్రకాశ్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, కార్పొరేటర్ స్రవంతి రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మమ్మల్ని రెగ్యులర్ చేయండి

- విద్యాశాఖ మంత్రిని, ఎమ్మెల్సీని కలిసి ఒప్పంద అధ్యాపకులు


విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసిన అధ్యాపకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తమను రెగ్యూలర్ చేయాలని కోరుతూ రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు కోరారు. ఆదివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ అందరికీ మేలు జరిగే విధంగా ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారని తెలియజేశారు. అలాగే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ఎంతోమంది ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిందని, తమకు కూడా న్యాయం చేస్తామని తెలియజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యచరణ అధ్యక్షులు తాళ్ల పెళ్లి వెంకటేశం, ఓయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ రామలింగం తేయు రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఏ సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ స్రవంతి రెడ్డి ఓయూ, డి యాదయ్య ప్రధాన కార్యదర్శి ఓయూ, డాక్టర్ ఎస్ రవి ఓయూ, సుజిత్ కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఎల్ మధు, కే అమరేందర్ ఎం జి యు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ జీమ్మీ పాలమూరు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి ఫొటో ఎక్కడ..?

- బీజేపీలో అంతర్గత కలహాలు!


నూతన రాష్ట్ర అధక్యక్షుడి ఫోటో లేకుండానే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ బిజెపి పార్టీ ఆఫీస్‌లో ఆదివారం బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. పార్టీ ఆఫీస్ కార్యక్రమంలో ఎక్కడ కూడా రాష్ట్ర అధ్యక్షుడు ఫోటో లేదు పాత అధ్యక్షుడిని ఫోటోతోటే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంటే ఇక్కడున్న జిల్లా నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని గుర్తించడం లేదా లేక ఇంకేమైనా పార్టీలో అంతర్గత విషయాల వల్ల ఫ్లెక్స్ మార్చడం లేదా అని కింది స్థాయి కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-మాక్లూర్

ఇటీవల భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వము తక్షణమే నష్టపరిహారము చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బోర్గం (కే) గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలవల్ల జిల్లావ్యాప్తంగా నష్టపోయిన పంటను అధికారులు పరిశీలించి, రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులకు సబ్సిడీ రుణాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తడకల కృష్ణ గౌడ్, సిర్రం శంకర్, గుండ్ల నాగేష్, దేశెట్టి లక్ష్మణ్, బేల్దారి సందీప్, ఆకోలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమా దేవరెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది యువకులు పార్టీ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం ఇవ్వబోతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్,ఆడేం గంగాప్రసాద్, ముస్కు మోహన్ రెడ్డి,గడ్డం జీవన్,జింక అనిల్,బెజ్జారం భాను,తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన, ఇంటినుండి పారిపోయిన

పిల్లల సమాచారం అందించాలి

- మానవ అక్రమ రవాణా పై అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మానవ అక్రమ రవాణాపై నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అవగాహనా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వి.వి.సుబ్బా రెడ్డి, సాధన సంస్థ కామారెడ్డి వారి ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే ప్లాటుఫామ్‌పై ప్రజలతో, ప్రయాణికులు ఆటో డ్రైవర్లతో మానవ అక్రమ రవాణాపై ఆర్పీఎఫ్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుండి పారిపోయిన పిల్లలు కనపిడితే సఖీ సిబ్బందికి సమాచారం అందించాలని లేదా చైల్డ్ లైన్ 1098కి గాని లేదా బచ్పన్ బచావో ఆందోళన్ హెల్ప్ లైన్ 18001027222 నెంబర్ కి గాని కాల్ చేసి తెలపాలని సూచించారు. పిల్లలని అక్రమ రవాణా చేసి పిల్లల అవయవాలని విక్రయిస్తున్నారని, అడపిల్లలని అసాంఘీక కార్యకలాపాలకి అలవాటు చేస్తున్నారని తెలిపారు. చిన్న పిల్లలని అక్రమ రవాణా చేసి వారితో బిక్షాటన చేయిస్తూ వ్యాపారంగా మలుచుకుంటున్నారని అన్నారు. ఇలాంటి వాటిని అరికట్టాలి అంటే అలాంటి పిల్లలు ఎక్కడైనా కనిపించిన లేదా పిల్లలని అక్రమంగా తరలిస్తున్న వారిని చూసిన, సమాచారం తెలిసిన అనుమానం వచ్చిన సంబంధిత సిబ్బందికి తెలియజేయా లన్నారు. ఈసందర్భంగా ప్రయాణికులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వే చైల్డ్ లైన్ కోఆర్డినటర్ బాబులు, ఎస్ ఐ ప్రవీణ్ నిజామాబాద్ రైల్వేస్టేషన్ లో గల రైళ్లలో పిల్లలను వెతికారు.



అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిన్నవాల్గోట్ నుండి రావుట్ల వరకు మంజూరైన రెండు లేయర్ల డబల్ రోడ్డు బీటి పనులను ఆదివారం సర్పంచ్ బొబ్బిలి రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రూరల్ ఎమ్మెల్యే టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో బీటీ రోడ్డు మంజూరు అయిందని ఆయనకు చిన్నవాల్గోట్ గ్రామ ప్రజలు వీడిసి సభ్యులు రుణపడి ఉంటామని తెలిపారు రోడ్డు పనులను నాణ్యతా లోపం లేకుండా చేయించాలని సదరు కాంట్రాక్టర్ గిరిని కోరారు. ఈ కార్యక్రమంలో సిరికొండ సింగిల్ విండో చైర్మన్ మైలారం గంగారెడ్డి, ఉపసర్పంచ్ గోగు మోహన్ రెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాడాల రాజ రెడ్డి టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దడువే గణేష్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి చేసి నిరూపిస్తాం

- బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసుల బాలరాజు


మాట్లాడుతున్న కాసుల బాలరాజు

నవతెలంగాణ-కోటగిరి

బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో చేసిన అభివృద్ధిని బాన్సువాడ నియోజకవర్గంలో ఐదు సంవత్సరాల్లో రెట్టింపుగా చేసి నిరూపిస్తామని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసుల బాలరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేవారు. కొత్తపల్లి గ్రామస్తులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బడుగులు, బలహీన వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పది సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, ఐదు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెట్టింపు చేసి చూపిస్తామని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి శంకర్, మాజీ ఎంపీపీ పవన్ కుమార్, ఎంపీటీసీ కొట్టం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


పార్టీ కండువా వేస్తున్న మచ్చర్ల సాగర్

నవతెలంగాణ-నంది పేట్

మండలంలోని రైతు ఫారం గ్రామంలో సుమారు వందమంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మచ్చల సాగర్ మాట్లాడుతూ...... గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించామని

యావత్ గ్రామమంతా హాజరై అన్ని కులాల మతాల సబ్బండ వర్గాల ప్రజలంతా గ్రామానికి గ్రామమంతా ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బడుగు బలహీన వర్గాల నాయకుడు జీవన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి ఆయనని ఎమ్మెల్యేగా గెలిపిస్తామని, తీర్మానించారని తెలిపారు. కార్యక్రమంలో కౌల్పూర్ సర్పంచ్ గబ్బర్ సింగ్, ఆంధ్ర నగర్ ఎంపీటీసీ దన్ శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగరావు, ఉప సర్పంచ్ అశోక్, రైతు ఫారం గ్రామ వి డి సి అధ్యక్షులు సందీప్, వార్డు మెంబర్ బుజ్జి రసూల్, గ్రామ పెద్దలు, యూత్‌నాయకులు పాల్గొన్నారు.

సోయా బస్తాలు స్వాధీనం

- ఎస్సై ఉదయ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్


స్వాధీనం చేసుకున్న సోయాబ్యాగులు

దొంగతనానికి గురైన సోయాబస్తాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కందకుర్తి రైతు వేదికలో వందశాతం సబ్సిడీపై రైతులకు 255 బస్తాలు రాగా 185 బస్తాలను పంపిణీ చేశారు. దాంట్లో నుంచి 70 బస్తాలు దొంగతనానికి గురయ్యాయి. వ్యవసాయ విస్తీర్ణ అధికారి గోపికృష్ణ 70 సోయా బస్తాలు దొంగతనానికి గురైనట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత 30 రోజుల కిందట వాచ్ అండ్ వార్డుగా పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ మీర్జా కలీం బేగ్‌కు గ్రామస్తులు రైతు వేదిక పక్కనే ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లలో సోయా బస్తాలు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆయన వెంటనే ఎస్సై ఉదయ్ కుమార్‌కు సమాచారం అందించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి ఎనిమిది కిలోల బస్తాలు 70ఉన్నట్లు తెలుసుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దొంగిలించబడ్డ ఈ బస్తాలపై కేసు నమోదు కావడంతో వాటిని కోర్టుకు సరెండర్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ మీర్జా కలీం బేగ్, ఎంపీటీసీ అసాద్ బేగ్, నీల సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, ఉప సర్పంచ్ దేవుళ్ళ యోగేష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి గోపికృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థలలో అనుమతించకపోతే ఆందోళనే

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ




మాట్లాడుతున్న రాజేశ్వర్

విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లో అనుమతించక పోతే ఆందోళనలు తప్పవని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ ఆర్ భవన్ లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలోకి విద్యార్థి సంఘాలను అనుమతించకపోతే సమస్యలపై విద్యాసంస్థల ముందే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలోకి విద్యార్థి సంఘాలను, మీడియాను, రాజకీయ నాయకులను అనుమతించకూడదని అనధికారికంగా విద్యాశాఖ అధికారులు జీవో జారీ చేయడం సరైంది కాదని అన్నారు. మన ఊరు మన బడి కింద నిధులను ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధికి వాడాలని, ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొత్తగా తీసుకొచ్చిన మెనూను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవిక, నిఖిల్,సాయి,వంశీ,తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-సిరికొండ



ఇటీవల కొండాపూర్ గ్రామ చెరువులో పడి చనిపోయిన తూము సుదర్శన్ కుటుంబాన్ని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబం ఆర్థికంగా చాలా వెనుకబడి ఉందని, వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆ ముగ్గురు పిల్లలకి తమ వంతు సహాయంగా వారి చదువులకోసం ఇచ్చారని తెలిపారు. వారి పైచదువులకు కూడా సహకరిస్తామని ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ చెప్పారు. కార్యక్రమంలో కొండాపూర్ గ్రామ సర్పంచ్ రమేష్, జగన్, మోహన్, సాయిలు, ఫౌండేషన్ మెంబర్స్ శ్రీకాంత్, గంగాధర్, వినోద్, రవి, రాజేందర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

- సీపీఐఎంఎల్‌న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-ఆర్మూర్

భారీ వర్షాలు వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ఆదివారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి అంచనా కట్టి నష్టపరిహారాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో సుమారు 10 లక్షల ఎకరాలు పంటల నీటిలో మునిగాయని తెలుస్తుందని అన్నారు. ఎకరానికి 20వేలు రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని అందించి, రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల వల్ల సర్వం కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సౌకర్యాన్ని అందించాలని, విద్యుత్తు, రోడ్డు సౌకర్యాలను పునరుద్ధరించాలని ఆయన అన్నారు. భారీ వర్షాల వల్ల ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రత్యేక నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. నిజామాబాద్ జిల్లాలో ఈ వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, వారందరికీ ప్రభుత్వం తోడుగా నిలవాలని దాసు కోరారు. ఆదివారం మామిడిపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపిఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బీ సూర్య శివాజీ, ఏఐకేఎంఎస్ నాయకులు ఆర్ బాబురావు, ప్రజా సంఘాల నాయకులు ఎస్ రవి, ఎస్ వెంకటేష్, పర్స అనిల్, ఇతరులు పాల్గొన్నారు.

ఏసీబీ, విజిలెన్స్ విచారణను బహిర్గతం చేయాలి

- వీసీకి సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలి
- లేకుంటే యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తాం
- టీయూ విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న నాయకులు

ఎసిబి, విజిలెన్స్ విచారణను బహిర్గతం చేయాలని, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్త కు సహకరించిన అవినీతి అధికారుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం యూనివర్సిటీలో తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలో ఈసీ మీటింగ్ పెట్టి, యూనివర్సిటీ అభివృద్ధిపై, సమస్యలపైన చర్చ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ వాకటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి స్పందించి అవినీతి అధికారుల పైన చర్యలు తీసుకోవాలని అన్నారు. యూనివర్సిటీలో అడ్వాన్సుల పేరు మీద, వస్తువుల కొనుగోలు పేరుమీద దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేసి యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. యూనివర్సిటీలో స్పోర్ట్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా గ్రౌండ్ ఏర్పాటు చేయాలని, క్రీడా పరికరాలు తీసుకురావాలని తెలిపారు. హెల్త్ కరిలో డాక్టరు, నర్సును, ల్యాబ్ టెక్నీషియన్‌ను నోటిఫికేషన్ ద్వారా తీసుకోవాలని, లైబ్రరీలో పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, జివిఎం నాయకులు విటల్, జక్కుల గజేందర్,ఎర్రం సురేష్, లక్ష్మీనారాయణ, శివ సాయి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

గన్యతండాలో తీజ్ ఉత్సవాలు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని గన్య తాండలొ తీజ్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు ప్రతి సంవత్సరం చాలా పెద్ద ఎత్తున ఈ పండగను జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెడి చిన్నారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు సొప్పరి వినోద్. రూరల్ ఎస్టి ఎస్టీ సెల్ యూత్ అధ్యక్షులు పిర్ సింగ్, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, రూరల్ వైస్ మండల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేశ్ పల్లి ప్రణయ్, రైమత్ అలీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రవి, బీసీ సెల్ మండల అధ్యక్షులు నారాయణ, యువజన విభాగ నాయకులు, గిరిజన సోదరులు పాల్గొన్నారు.


తీజ్‌లో పాల్గొన్న కాంగ్రెస్‌నాయకులు

రోటరీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో రోటరీ క్లబ్ 36వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 2023-24కు గాను నూతన అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణతో ప్రమాణ స్వీకారం చేయించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ వి శ్రీనివాస్ రావు, పిడి జి హనుమంత్ రెడ్డి హాజరై ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మార గంగా రెడ్డి మాట్లాడుతూ రోటరీ సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సేవలను నలుమూలల విస్తరింప చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణంలోని నీట్ ర్యాంకర్స్, స్పోర్ట్స్ రంగంలో విజేతలు నిలుస్తున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో చంద్రసేన్ రెడ్డి, కాంతి గంగారెడ్డి పద్మ మురళి, బండారి ప్రసాద్,చరణ్ రెడ్డి పుష్పకరావు విజయసారథి రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



ర్యాంకు సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎకరానికి 25వేల పరిహారం అందించాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి


నవతెలంగాణ-ఏర్గట్ల

భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున పంట నష్టం అందించేలా మంత్రి ప్రశాంత్ రెడ్డి చూడాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని దోంచంద గ్రామంలో నష్టపోయిన పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్ గ్రామాల్లో వరదల వల్ల పంటలు చాలా మట్టుకు దెబ్బతిన్నాయని అన్నారు. ఈ సంవత్సరం వేసవి కాలంలో కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించి 10 రూపాయల చొప్పున నష్టపరిహారం అందిస్తానని చెప్పి ఇప్పటికీ అందించలేదని అన్నారు. సోయాబీన్ నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పి ఆదుకోలేదని తెలిపారు. మొలకెత్తని పంట నష్టపోతే ఇన్‌పుట్ కూడా అందించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వరదల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించేవారని, పిడుగు పాటుకు పశువులు మృతిచెందితే 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించేవారని గుర్తుచేశారు. మరో వైపు ఎంపీ అరవింద్ అప్పుడప్పుడు రాజకీయ పర్యటనలతో హడావిడి చేయడం తప్ప ప్రజలకు ఇబ్బందులు వచ్చినప్పుడు కనబడడం లేదని, కేంద్ర బృందాలు వచ్చి వెళ్తున్నప్పటికి జిల్లా రైతులకు ఒక్క రూపాయి కూడా అందడం లేదని అన్నారు. అరవింద్ కు రైతుల ఓట్లు కావాలి కానీ, వారు కష్టాల్లో ఉన్నప్పుడు పట్టదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రి నష్టపోయిన పంటలను పరిశీలించి ఎకరాకు 25 వేలు, ఇసుక, మొరం మేటలు వేసిన పంట పొలాల చదునుకోసం 50 వేల రూపాయలు అందించాలని అన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, లింగారెడ్డి, వెంకట్ రెడ్డి, నాయకులు అన్వేష్, జింక అనిల్, బెజ్జారం భాను చందర్,జీవన్, ముస్కు మోహన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


నీటమునిగి పంటను పరిశీలిస్తున్న నాయకులు

టీజీవీపీ 11వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


జెండా ఎగురవేసిన నాయకులు

తెలంగాణ విద్యార్థి పరిషత్ 11వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద జిల్లా అధ్యక్షుడు సంఘ పతాకాన్ని ఆవిష్కరించి.మిఠాయి పంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వెళ్లి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సజ్జనం భానుచందర్ పాల్గొని కార్యకర్తలతో పాటు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2012లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం స్వప్నాన్ని నెరవేర్చుకోవడానికి ఈసంఘం ఏర్పడిందన్నారు. విద్యారంగ సమస్యలపై ఏ రాజకీయ పార్టీకి అంటకాగకుండా కేవలం విద్యారంగ అభివృద్ధియే సంస్థ ఎజెండాగా మార్చుకొని పోరాడుతున్న సంస్థని తెలిపారు. ఇక ముందు కూడా ఇదే విధంగా తెలంగాణ విద్యార్థుల కోసం విద్యారంగం కోసం నిరంతర ఉద్యమాలు చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు. రక్తదాన శిబిరంలో 15 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అఖిల్, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ అనిరుద్రాజ్, సాంఘిక సంక్షేమ హాస్టల్ ఇన్చార్జ్ ఎర్ర ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు

పట్ట పగలే వీధుల్లో వెలుగులు

- ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

నవతెలంగాణ-భీంగల్



విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉచిత సలహాలు అందించే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పాటించడం లేదు. మండలంలోని బెజ్జోర గ్రామంలో వీదిదీపాలు పగలు రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై సర్పంచ్ భర్త సుమన్ లైన్‌మెన్, లైన్ఇన్‌స్పెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెట్టడం.. ఏఈకి పిర్యాదు చేసినను పట్టించుకోవడం లేదని తెలిపారు. కనుక ఇప్పటికైన రాత్రిపూటనే వీదిదీపాలు వెలిగే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మంత్రి ధ్యేయం

నవతెలంగాణ-భీంగల్

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మంత్రి ధ్యేయమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పిప్రి గ్రామంలో ఇటీవల వర్షాలకు సర్వం కోల్పోయి నష్టపోయిన వారికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేసిన నిత్యావసర సరుకులను అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, యంపిటిసి సరితస్వామి, నాయకులు రాజేందర్‌గౌడ్, జనార్ధన్ తదితరులున్నారు

నిత్యవసర సరుకుల అందజేత

నవతెలంగాణ-భీంగల్

ఇటీవల కురిసిన వర్షాలకు సర్వం కోల్పోయిన దేవక్కపేట్ గ్రామంలోని బాదితులకు కాంగ్రెస్ నాయకుడు ముల్యాల సునీల్‌రెడ్డి నిత్యావసర సరుకులను అందజేశారు. వీటిని సునీల్‌రెడ్డి అనుచరులు ఆదివారం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చైతన్య యూత్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామ చైతన్య యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా మోత్కూరి నరేష్, ఉపాధ్యక్షులుగా మోత్కూరి శ్యామ్, ద్యావరి నర్సింలు, కోశాధికారిగా ద్యావరి నవీన్, నీలం శేఖర్, సెక్రటరీగా నీలం రవికుమార్, దేవళ్ల శేఖర్, జాయింట్ సెక్రటరీగా గోలి నరేష్, అంకం ప్రకాష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా నర్సింలు, ద్యావరి నరేష్, వురుదొండ నరేష్, తిమ్మక్ పల్లి ప్రవీణ్, హన్మంత్ యాదవ్, బొర్ర రాజు, మహిపాల్, తూర్పు నరేష్ లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ, క్లబ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అన్నదానం


అన్నదానం చేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం లయన్స్ ఇంటర్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లయన్స్ ఆధ్వర్యంలో అనాథలకు, వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు , పేద విద్యార్థులకు ప్రైమరీ స్థాయిలో బ్యాగులు , నోట్ బుక్స్ అందిస్తూ , ఉన్నత చదువుల హాస్టల్ ఫీజుల నిమిత్తం అధిక మొత్తంలో డబ్బులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు నారాయణరెడ్డి, వేణుగోపాల్ , రాజేంద్రప్రసాద్ , లక్ష్మీనారాయణ , రాజు సెట్ , శేఖర్ సెట్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమాన గౌరవం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

సీఎం కేసీఆర్ అన్ని కుల మతాలకు సమాన గౌరవం ఇస్తున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో రూ. 25 లక్షలతో నూతనంగా నిర్మించే రేణుకా ఎల్లమ్మ గుడి నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం రూ. 1.35 కోట్లతో అండ్‌అండ్‌బీ రోడ్డు నుండి కొచ్చెర మైసమ్మ దేవాలయం మీదుగా లింగంపల్లి తండా వరకు వేయనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మైలారం గ్రామ పరిధిలోని శ్రీ కొచ్చెరి మైసమ్మ దేవాలయం వద్ద రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించే కాటేజ్, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో స్పీకర్ పోచారం మాట్లాడారు. 'అన్ని మతాలను, సాంప్రదాయాలను గౌరవించాలి. భక్తితో మానసిక తృప్తి లభిస్తుంది. బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాలు, మందిరాలు, సన్నిధానాల నిర్మాణం కోసం 2014 నుండి ఈరోజు వరకు రూ.150 కోట్లు మంజూరు చేశాను. భక్తులు, దాతలు పూనుకున్నప్పుడే దేవాలయాలు అభివృద్ధి చెందుతాయి. కొచ్చెరి మైసమ్మ దేవాలయం అంచలంచలుగా అభివృద్ధి చెందుతున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ వచ్చిన తరువాత దేవాలయాల అభివృద్ధి కోసం నిధులు పుష్కలంగా వస్తున్నాయి. ఇక్కడ భక్తుల సౌకర్యం కోసం నాలుగు కాటేజీలను నిర్మిస్తున్నాం. దేవాలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉండడానికి సీసీ రోడ్లు వేస్తున్నాం. రూ. 10 లక్షలతో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేశాను. పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి. భవిష్యత్తులో కూడా ఆలయం పరిసరాలలో అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-జుక్కల్



సోపాన్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గురుపూజోత్సవంలో భాగంగా ఆదివారం జుక్కల్ మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయునికి కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా తపస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జనార్ధన్, ఉపాధ్యక్షుడు హీరాజాదవ్ మాట్లాడుతు గ్రామీణ మారుముల ప్రాంతాలలో పేద విద్యార్థులకు విద్యను అందించడం పూర్వ జన్మ సుకృతం అని ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. జుక్కల్ మండలం నుండి ఉపాధ్యాయుడు సోపాన్ ఎంపికయ్యారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, రాష్ట్ర తపస్ సంఘం అధ్యక్షుడు హన్మంత్ రావ్, చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మండల తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జయ్ చంద్, ఉపాధ్యక్షుడు హీరా జాదవ్, కార్యవర్గ సభ్యులు అనీల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాసులబాద్ గ్రామంలో ఆదివారం సర్పంచ్ శోభ బుసాప్ప సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌డీఎస్ నిధులు ఐదు లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యే హన్మంత్ షిండే కృషి వల్ల గ్రామంలో అభివృద్ధి పనుల్లో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

లింగంపేట్ ఎస్సైగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-లింగంపేట్



ఎస్ఐ ప్రభాకర్

లింగంపేట్ ఎస్సైగా ఎం ప్రభాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన డి శంకర్ సిద్దిపేట్ జిల్లాకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రభాకర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలకు మండలం లోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ప్రజలు పోలీసులతో మమేకం కావాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు సంచరించినట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరని మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతివేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని ఆయన వాహనదారులను సూచించారు. ఈయన వెంట కానిస్టేబులు సిబ్బంది ఉన్నారు.

మంత్రి నిర్లక్ష్యానికి బలవుతున్న రైతులు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


పంటపొలాలను పరిశీలిస్తున్న నాయకులు

జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిర్లక్ష్యానికి ప్రజలు బలవుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని చౌట్ పల్లి గ్రామంలో వరదల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను, మరమ్మత్తులు చేసిన 15 రోజులకే దెబ్బతిన్న ఈదుళ్ళకుంట చెరువును, అమీర్ నగర్ లో దెబ్బతిన్న పంట పొలాలను పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... చౌట్ పల్లి గ్రామంలోని ఈదుళ్ళకుంట చెరువుకు మరమ్మత్తులు చేసిన 15 రోజులకే మట్టి కొట్టుకుపోయి లీకేజీకి గురైందని విమర్శించారు. ఒకపక్క మంత్రి కమిషన్ల కోసం ప్రణాళిక లేకుండా నిర్మించిన చెక్ డ్యాముల వల్ల పంట పొలాలు మునిగిపోతుంటే, మరోపక్క మరమ్మత్తులు చేసిన చెరువులు వరదలకు మట్టి కొట్టుకుపోతున్నాయన్నారు. ఇది మంత్రి ప్రశాంత్ రెడ్డి నిర్లక్ష్యపు పనితీరుకు నిదర్శనమని ఆయన అన్నారు. వరద ఇంకొంచెం ఎక్కువగా వచ్చి ఉంటే చెరువు కట్ట తెగి ఆయకట్టు కింద ఉన్న పొలాలన్నీ నీట మునిగేవని, ఇప్పటికైనా మంత్రి కళ్ళు తెరిచి చెరువుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాథోడ్ చెరువును సందర్శించారు. ఊర చెరువు నుండి రాథోడ్ చెరువులోకి నీటిని మళ్లించడం వల్ల పొలాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయన్నారు. మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉందని రైతులు అధికారులకు, మంత్రికి మొర పెట్టుకున్నప్పటికీ వారి సమస్యను పరిష్కరించలేదన్నారు. వచ్చే ఏడాది రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అన్నారు. అమీర్ నగర్ లోని గట్టుపొడిచిన వాగు వద్ద ఫీడర్ ఛానల్ అసంపూర్తిగా వదిలేయడం వల్ల వరదలు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల్లోకి చేరి పొలాలు కోతకు గురయ్యాయని, ఫీడర్ ఛానల్ అసంపూర్తిగా వదిలేయడం వల్ల నాలుగు సంవత్సరాలుగా రైతులు నష్టపోతున్నారన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పడిగల ప్రవీణ్, భువనగిరి భాస్కర్, అల్లకొండ రాజేష్, నూకల బుచ్చిమల్లయ్య, సుంకేట శ్రీనివాస్, గోపిడి లింగారెడ్డి, ఉట్నూరు ప్రదీప్, మహేందర్ గౌడ్, పూజారి శేఖర్, సూర స్వామి, పుప్పాల నరసయ్య, అనిల్, రాజుల రమేష్, కుమ్మరి లింబాద్రి, కుందేటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కండ్ల కలక పట్ల జాగ్రత్తలు పాటించాలి

- వైద్యాధికారుల సూచనలు

నవతెలంగాణ-లింగంపేట్/పిట్లం



వాతావరణ మార్పులతో బ్యాక్టీరియా కారణంగా ప్రజలకు కండ్ల కలక వ్యాపిస్తుందని, ఈ వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ఆదివారం పత్రికకు ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా సూచనలు సహాలు సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్ళను తాకినప్పుడు బ్యాక్టీరియా లోనికి చేరి కండ్ల కలక బారిన పడతారని అన్నారు. ఈ వ్యాధి వలన కళ్ళు ఎరుపెక్కడం, నీరు కారడం, దురదగా ఉండడం దీని ముఖ్య లక్షణాలన్నారు . కావున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని కళ్ళకలక వలన వచ్చే దుష్పరిణామాలనుండి కాపాడుకోవాలని సూచించారు. 'నీళ్ల కాచి చల్లార్చి దూదితో కళ్ళను తుడ్చుకోవాలి. చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఉతికిన తవల్స్ , కర్చీఫ్స్ మాత్రమే వాడాలి. కళ్లకలక తగ్గే వరకు కళ్ళ జోడు ఉపయోగించాలి. కళ్ళలో విపరీతమైన దురద , మంట ఉంటే డాక్టర్ ను సంప్రదించాలని' సూచించారు.

కండ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ రోహిత్ కుమార్

పిట్లం: కండ్ల కలకపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రోహిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కండ్లు ఎర్రబడినా, రెప్పలు తెరుచుకోకుండా నొప్పిగా ఉన్నట్లయితే వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. కలక వచ్చినవారు ఇంటిలోనే సేఫ్టీ ఉండాలని సూచించారు. తరచూ కళ్ళను తాక వద్దని సూచించారు ఎప్పటికప్పుడు చేతులు శుభ్రపరచుకోవాలని, కళ్ళజోడు ధరించి జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి నియోజకవర్గంలోని 40 మందికి 30 లక్షల 02 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదివారం అందజేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజిబోదిన్ తో కలిసి పంపిణీ చేశారు .ఇందులో భాగంగా 05 మందికి 10 లక్షల 50 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ ఒ సి పత్రాలను అందజేశారు. మిగతా 35 మందికి 19 లక్షల 52 వేల చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,057 మందికి 12 కోట్ల 44 లక్షల 53 వేల 700 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో ఖర్చయినా డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పిస్తామని తెలిపారు. ఆసుపత్రి నుండి వచ్చిన తర్వాత సంబంధిత పత్రాలను తమ కార్యాలయంలో ఇస్తే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రామ్ రెడ్డి, నల్లవెల్లి అశోక్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదేశాలు వెనక్కు తీసుకోవాలి



- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో, కెజీబివిలో, మోడల్ స్కూల్స్‌లోకి డిఇఓ అనుమతి లేకుండా లోపలికి రావడానికి అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ టీయూ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆదివారం న్యూ బాయ్స్ హాస్టల్ ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ టీయూ కమిటీ కార్యదర్శి కామిరే శ్రీశైలం మాట్లాడుతూ అధికరణ 19 ప్రకారం సంఘాలు సమావేశాలు ఏర్పరచుకునే స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ అదే విధంగా నాల్గవ స్తంభం అయినట్టువంటి మీడియా నూ సైతం రావద్దని , అప్రజాస్వామ్య బద్ధంగా విద్యాశాఖ నోటీసులు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు లవిశెట్టి ప్రసాద్, ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, సహాయ కార్యదర్శులు దినేష్, చిత్రు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

- జేపీసీ కన్వీనర్ జంగం గంగాధర్
- జిపి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు

నవతెలంగాణ-ఎడపల్లి


వర్నిలో జీపీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా? అని జేపీసీ కన్వీనర్ జంగం గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని ధర్నా చౌక్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ అండ్ యూనియన్ జెఎసి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులు, సిబ్బంది చేతులతో నోరు మూసుకొని నిరసన తెలిపారు. అనంతరం జంగం గంగాధర్ మాట్లాడుతూ సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. సమ్మెలో మండల జేఏసీ కో కన్వీనర్ కుంట సంతోష్ ,గంగరాజు ,పాండు, బిల్ కలెక్టర్ల యూనియన్ మండల అధ్యక్షులు రాజు, పద్మావతి, వెంకట్ గౌడ్ ,రహిమత్, గరిగుంట్ల శ్రీనివాస్ ,స్వామి ,సాయమ్మ , లక్ష్మీ, అబ్బవ్వ పాల్గొన్నారు.

రెంజల్: తమ సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఫసియుద్దీన్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం సేవ చేస్తున్నప్పటికీ సీఎం కేసీఆర్‌కు గుర్తుకు రావడం లేదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోతయ్య, లక్ష్మణ్, సతీష్, గంగమణి, నక్క అనిత, గైన భూలక్ష్మి, గైని పల్లయ్య, మాజీ మండల అధ్యక్షులు మక్కన్న, ఎస్ కే లాయక్, బత్తిరి గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

వర్ని(రుద్రూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల 25వ రోజు సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమ్మెకు స్పందించకపోవటం సిగ్గు చేటని అన్నారు. కార్యక్రమం లో డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి ,అడ్వకేట్ వెంకట్ రాంరెడ్డి, దామరంచ సొసైటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి మాశెట్టి శ్రీనివాస్, డీసీసీ డెలిగేట్ గంగాప్రసాద్, జిల్లా మైనారిటీ కార్యదర్శి వహీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సంఘీభావం

నవీపేట్: మండల కేంద్రంలోని పంచాయతీ సిబ్బంది సమ్మెకు మాజీ వార్డు సభ్యులు, టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాస శివకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి పి సిబ్బంది సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమని అన్నారు. వెంటనే కార్మికులకు ఉద్యోగ భద్రత, 10 లక్షల బీమా సౌకర్యం మరియు వారి పిల్లల కోసం రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కోటగిరి: ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా 25 నుండి నిరవధికంగా పంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. వీరికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూనీపూర్ రాజిరెడ్డి, ఎలమంచిలి శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు. మూడు రోజుల క్రితం గాయపడిన పంచాయతీ కార్మికులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు, పంచాయతీ కార్మికులకు సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్, సిఐటియు మండల నాయకులు నన్నేసాబ్, ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లేష్ సంఘీభావం తెలిపారు వారి న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చేదాక సమ్మె కొనసాగిస్తామని, సంబంధిత శాఖ మంత్రి దయాకర్ రావు పంచాయతీ కార్మికుల పట్ల చిన్నచూపు చూడడం తగదని హితవు పలికారు.

బోధన్: తమ కు కనీస వేతనాలను అందించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఆదివారం బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తూ సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. 31న సోమవారం చేపట్టె నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం ముట్టడిలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమ్మెలో కార్మిక నాయకులు రేఖ, లక్ష్మి, పోషవ్వ, గంగమణి, రాజమణి, లలిత, ఎల్లవ్వ, సావిత్రి, శంకర్, కోండిబా, గౌతం, సాయిలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో..


కోటగిరిలో..

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు అన్నదానం


కోటగిరిలో అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-కోటగిరి/ఆర్మూర్/మోర్తాడ్/వర్ని

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేనిబాబురావుజన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం 120 మంది పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు అన్నదానం నిర్వహించారు. బాబురావు సేవలు మరువలేనివని క్లబ్ అధ్యక్షులు హనుమంతరావు పేర్కొన్నారు. స్నేహం, సేటవ దృక్పథంతో ఇంటర్నేషనల్ డైరెక్టర్లుగా ఎహగ్రీవంగా ఎన్నికైన వ్యక్తి లైన్ ఘట్టమనేని డాక్టర్ బాబురావుని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్స్ సభ్యులు కోటగిరి లైన్స్ క్లబ్ కోశాధికారి అనిల్, ప్రధాన కార్యదర్శి జానకిరావు, ప్రోగ్రాం చైర్మన్ పత్తి లక్ష్మణ్, లైన్స సభ్యులు మా శెట్టి మహేష్, కూచి సిద్దు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జి బాబురావు 67వ జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వారి ఆధ్వర్యంలో మామిడిపల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం పరిసరాల్లో గల నిరుపేద ప్రజలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ అధ్యక్షులు లయన్ జెంటిల్ కిడ్స్ ప్రకాష్ గుజరాతి, ప్రధాకార్యదర్శి లయన్ అల్జాపూర్ రాజేష్ ,కోశాధికారి లయాన్ కుంటాల నరేందర్ మాజీ అధ్యక్షుడు లయన్ చేపూర్ గణేష్ మాజీ జోనల్ చైర్పర్సన్ డీకే రాజేష్, సభ్యులు లయన్ నసీరుద్దీన్, దాచేపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

... లైన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో..,

లయన్స్ క్లబ్ అఫ్ నవనాతపురం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబు రావు 67 వ జన్మదినం సందర్భంగా ఆర్మూర్ లోని లెధర్ పార్క్ వద్ద గల సుందరయ్య కాలనీ లో నిర్వహించామని లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ తెలిపారు. కార్యక్రమం లో క్లబ్ కార్యదర్శి చెరుకు ప్రీథ్వీ రాజ్, ప్రోగ్రాం చైర్మన్ రాజన్న, కో చైర్మన్ లోచర్ చంద్ర శేఖర్, చెన్న రవి, హేమ లత, రాహుల్, గణేష్, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని జాతర మైదానంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 300 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబు రావు గారి 67వ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్టు క్లబ్ మండల చైర్మన్ మామిడాల మనోహర్ తెలిపారు. బాబురావు చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మోహన్, సభ్యులు గోపిటి సత్యనారాయణ, సామ శీను, భోగా ఆనంద్, నూతి కట్టు గిరిధర్, ఎలాల రాజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండల లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ చైర్మన్ బాబురావు 67వ జన్మదినం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ని బస్టాండ్ ప్రాంతంలో పేదలకు లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వర్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొరబాబు, కార్యదర్శి అతిమల నాగేష్, ట్రెజర్ శ్రీ నివాస్ , శ్రీ మన్నానారాయణ, సుబ్బారావు, బారత్ గ్యాస్ నర్సయ్య, కోటేశ్వరరావు, కనకరాజు, ఉదయబాస్కర్, కులకర్ణి నాగేష్, విఠల్, కిషోర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు



ఆర్మూర్‌లో..

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన (పోలీస్ కానిస్టేబుల్) ఏలేటి నరేష్‌రెడ్డి (37) రెండు రోజుల క్రితం మరణించాడు. అతని కుటుంబాన్ని ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరేష్ మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ గడ్డం జనార్ధన్ రెడ్డి తల్లి బుచ్చవ్వ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో ఇటీవలే అనారోగ్య కారణాలతో చనిపోయిన బిఆర్ఎస్ కార్యకర్త చిట్యాల రాజు తండ్రి పర్వయ్య, అల్లారి బస్వయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ నాయకులు కృష్ణమూర్తి, బల్ రాజ్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ సాయి రెడ్డి, మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రమేష్ రెడ్డి, బాణాల గంగా రెడ్డి, రాంరెడ్డి, రాజి రెడ్డి, మర్రి గోపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సిద్ది రాములు, ఉప సర్పంచ్ సుమన్ రెడ్డి, సాయి రెడ్డి, జి.రాజి రెడ్డి, ఎంపీటీసీలు సాగర్, రాజు, ముడం నర్సింలు, ప్రభాకర్ రెడ్డి,రాజ గౌడ్, ప్రణీత్ రెడ్డి, రూపేష్ రెడ్డి, కిరణ్ రెడ్డి, గ్రామస్తులు మరియు తదితులు ఉన్నారు.

13న యుద్ధభేరి గర్జనకు తరలిరావాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పద్మశాలి రాజకీయ కొరుట్ల యుద్ధభేరి గర్జన ఆగస్టు13న నిర్వహిస్తున్నట్టు పద్మశాలి జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు ఉపాధ్యక్షులు బిజ్జు దత్త్రాద్రి, పట్టణ అధ్యక్షులు. అంబల్ల శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. రాజ్యాధికార సాధనకు చలో కొరుట్ల సమావేశానికి జిల్లా పద్మశాలి నాయకులూ రావాలని పెర్కిట్ పట్టణ సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్రామ్, మండల అధ్యక్షులు బొడ్డు గంగధర్, కోశాధికారి చిట్ల యజ్ఞేశ్, తెలంగాణ చేనేత ఐక్య వేదిక కోశాధికారి సిలివేరి గణేష్ , రూరల్ మాజీ అధ్యక్షులు లోలం జగదీష్ పట్టణ సహాయ కార్యదర్శి బింగి మోహన్, తర్ప అధ్యక్షులు గంగచరణ్ . బీమానాథ్ సత్యనారాయణ, కృష్ణ మూర్తి, తదితరులు తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి విరాళం

- అందజేసిన పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


విరాళం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

మండల కేంద్రంలో జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో అదనపు గదుల నిర్మాణం కోసం పూర్వపువిద్యార్థులు విరాళం అందజేశారు. స్కూల్ డెవలప్మెంట్ కమిటీకి 2002-2003 బ్యాచ్ విద్యార్థులు రూ.15వేలు విరళంగా అందించారు. ఈ పనులనూ ముందుఉండి నడిపిస్తున్న పైపుల రాజారెడ్డికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీ సభ్యుడు రూపాల గంగారెడ్డి, సికింద్రాపూర్ మాజీ ఉప సర్పంచ్ అప్పల అరుణ్ కుమార్, తిట్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్‌కు సన్మానం


భూమయ్యను సన్మానిస్తున్న ఆర్టీసీ చైర్మన్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన చిన్నోళ్ల అదరంగి భూమయ్యను నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నియమించి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, కమల నరేష్ తనపై విశ్వాసం ఉంచి నియమించినందుకు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్మోహన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి గారు, గారు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రావు గారు పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గారు, ముట్టెన్న, ఉమపతి రావు, రాజశేఖర్, కెంపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

33వ రోజుకు రిలే దీక్ష..

దేవాలయ కమిటీ సభ్యుల మద్దతు


నినాదాలు చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు రైతులు చేపట్టిన నిరావధిక సమ్మె 33వ రోజుకు చేరుకుంది. ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. తమ గ్రామంలోని బందల్లా రోడ్డు, మాచపురం, గంగమ్మ తల్లి, శివాలయం బైపాస్ రోడ్డు పనులను పూర్తి చేసేవరకు నిరవధిక సమ్మెను నిలిపే ప్రసక్తి లేదని అన్నారు. కనీసం పనులను ప్రారంభించాలని వారన్నారు. నేటి దీక్షలు దేవాలయ కమిటీ సభ్యులు సతీష్, క్రాంతి, రంజిత్, దినేష్, లక్ష్మణ్ గౌడ్, రాజేశ్వర్, భూమన్న, కిరణ్, అనిల్, భాను, నరేందర్, శీలం రాజు, గ్రామ కమిటీ సభ్యులు, రెంజల్ గ్రామం తరపున రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

పెద్దల సమక్షంలో ప్రేమ పెళ్లి



పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమజంట

నవతెలంగాణ-వర్ని

మండలంలోని లక్ష్మపూర్ గ్రామంలో ఆదివారం సర్పంచ్ సత్యనారాయణ పెద్దల సమక్షంలో ప్రేమికులకు పెళ్లి చేసినట్లు తెలిపారు. చందూర్ గ్రామానికి చెందిన అమ్మాయి, లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అబ్బాయి ప్రేమించుకున్నారు. విషయం తెలిసిన ఇరు కుటుంబాలు ప్రేమ పెళ్ళికి ఒప్పుకోక పోవడంతో సర్పంచ్‌ను ఆశ్రయయించారు. సర్పంచ్ ఇరువురు కుటుంబాలను ఒప్పించి ఆదివారం పెద్దల సమక్షంలో ప్రేమికులకు పెళ్లి చేశారు. ఇద్దరు కలసి ఉండేలా పెద్దల మధ్యలో ఒప్పందం పత్రం రాసుకొన్నారని తెలిపారు. ప్రేమికులు సర్పంచ్‌కు, గ్రామాల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

మా పంట పొలాలను రక్షించండి

నవతెలంగాణ-రెంజల్



మండలం బోర్గం గ్రామంలోని చెరువు బ్యాక్ వాటర్ ద్వారా సుమారు 45 ఎకరాల వరి పంట నీట మునిగిం దని, అధికారులు వెంటనే స్పందించి చెరువు నీటిని తూము ద్వారా తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు. వారం పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పూర్తిగా మునిగిపోయిందని, నీటిపారుదల శాఖ అధికారులు కానీ, రెవెన్యూ శాఖ వారు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. తూముల ద్వారా నీటిని వదిలడానికి ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం శోచనీయమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ పంటలను రక్షించాలని, నష్టపోయిన పంటకు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడుతున్న గోదావరి ఘాట్


గోదావరి స్నానాలకు వచ్చిన భక్తులు

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ల వద్ద భక్తులు ఆదివారం అత్యధిక సంఖ్యలో విచ్చేసి స్నానాలను ఆచరించారు. కందకుర్తి గోదావరిలోనున్న రాతి శివాలయం పూర్తిగా నీటిలో మునిగి ఉండడంతో గోదావరి ఒడ్డున ఉన్న పుష్కర దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి విచ్చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల భవనాలు

- మన ఊరు.. మనబడి.. కొన్నిటికే పరిమితమా?
- ఏడేళ్లైనా గోవింద్‌పేట్ పాఠశాలలో పూర్తికాని అదనపు గదులు
- నిధుల కొరతే కారణం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది .జిల్లాలోని 405 పాఠశాలల్లో 109 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతులు లభించి కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయి ప్రారంభమయ్యాయి. ఈ పథకం కింద ఎంపిక కాని పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.

రెండు మండలాల్లో..

జిల్లాలోని ఆర్మూర్, ఆలూరు రెండు మండలాల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు 41, ప్రాథమికోన్నత పాఠశాల 1, ఉన్నత పాఠశాలలు 21 ఉండగా మొత్తం విద్యార్థులు 7,378 విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మూత్రశాలలు లేకపోవడం, కొన్ని పాఠశాలల్లో ప్రహరీలు లేకపోవడం వీటికి తోడు ఇటీవల కురిసిన అకాల వర్షాలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు.మండలంలోని చేపూర్, గోవింద్‌పేట్, ఫతేపూర్ ఉన్నత పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫతేపూర్‌లో 55 మంది విద్యార్థులు చదువుతుండగా భవనం శిథిలావస్థకు చేరి తరచూ పైకప్పు పెచ్చులూడుతోంది. గదుల కొరతతో వర్షంతో కురుస్తున్న శిథిల భవనాన్నే ఉపయోగిస్తున్నారు. ఇక్కడ 6 అదనపు గదులు మూత్రశాలలు, ప్రహరి నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, కుక్కలు, పశువులు సంచరిస్తున్నాయి. ఇటీవల పాఠశాల ఆవరణలోనే ఒక పామును చంపేశారు. మండలంలోని గోవింద్‌పేట్ పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉండగా భవనం శిథిలావస్థలో ఉన్నప్పటికీ గదులు లేకపోవడంతో తరగతుల నిర్వహణ కంప్యూటర్ గది సైన్స్ లాబ్ గది ఇందులోనే కొనసాగిస్తున్నారు. అయితే పాత భవనాన్ని పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాల్సి ఉంది. ఈ పాఠశాలలో వెనక వైపు ప్రహరీ లేదు. ఏడు సంవత్సరాల కింద అదనపు గదుల నిర్మాణం కోసం పిల్లర్లు వేశారు. నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశారు. చేపూర్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రెండు సంవత్సరాల కిందట కురిసిన భారీ వర్షాలకు గదుల రేకులు ధ్వంసం అయినాయి. నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మత్తులు చేయలేదు. అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ మంజూరు కాలేదు. అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఫతేపూర్ ఉన్నత పాఠశాలలో ఊడిన పెచ్చులు


గోవింద్‌పేట్ పాఠశాలలో డిజిటల్ రూములో దశ్యం

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం...

మన ఊరు మనబడి పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లోనూ పనులు కొనసాగుతున్నాయి. ఎంపిక కాని పాఠశాలల్లో అదనపు గదులు, ఇతర సౌకర్యాల కోసం ఉన్నతాధికారులకు గతంలో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయితే పనులు ప్రారంభిస్తాం.

రాజా గంగారాం, మండల విద్యాధికారి-ఆర్మూర్, ఆలూరు.

ట్రాన్స్ 'ఫార్మర్ల' కష్టాలు

- నాటే సమయంలో తిప్పలు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని మంచిప్ప గ్రామ శివారులో గల రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలే అతివృష్టితో బాధపడుతుంటే, మరో పక్కన కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పంట నాటే సమయం గడిచిపోతున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి ఇంకా ఇబ్బందికి గురి కావాల్సి వస్తుంది. రైతులే స్వయంగా జెసిబిని మాట్లాడుకొని ట్రాన్స్‌ఫార్మర్లను తమ పొలం ఒడ్డు నుండి రోడ్డు వరకు నానా కష్టాలు పడుతూ తీసుకురావాల్సి వస్తుంది ఇప్పటికైనా రైతు ప్రభుత్వమైన ఈ రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి గమనించాలని, వారిని ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. ఆ దున్నినీళ్ళ నిండిన బురద పొలం నుండి ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుకు తీసుకురావడానికి రైతు పడుతున్న కష్టం వర్ణించలేనిది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కరెంటు కష్టాలు తీరుతాయి అనుకుంటే గడిచిన ఆరు మాసాల నుండి కరెంటు కోతలతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన ఒడ్డుకు చేర్చి మరమత్తులు చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇదేనా నా బంగారు తెలంగాణ అని రైతుల ప్రశ్నిస్తున్నారు.


జేసీబీతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న రైతులు

ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు రూ .50 లక్షలు మంజూరు

నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణం కోసం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన నిధుల నుంచి 50 లక్షలను అందించారు. మోపాల్ గ్రామ మాల సంఘానికి 25 లక్షలు, మాదిగ సంఘానికి 25 లక్షలు ప్రోసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు. మోపాల్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ సోదరులు తమ సొంత స్థలంలో భవన నిర్మాణం చేసుకుంటామని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి కోరారు. ఈమేరకు నిధులు కేటాయించారు. ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపి వచ్చే ఎన్నికల్లో గోవన్నని భారీ మెజార్టీ తో గెలిపించుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి గారు, జడ్పిటిసి కమల నరేష్ , రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రావు, స్థానిక ఎంపిటిసి ముత్తన్న, సర్పంచ్ క్యాతం రవి, గ్రామ శాఖ అధ్యక్షులు కెంపు సాయిలు, ఎస్సీ కమ్యూనిటీ సోదరులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

అదనపు గది నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం పోచారం గ్రామంలోగల శ్రీ రామాలయ ఆవరణంలో అదనపు గది నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల నుండి 5 లక్షల రూపాయలను మంజూరు చేసినట్టు బిజెపి రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి మంజూరు చేయించారని సర్పంచ్, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్ తెలిపారు. అంతకు ముందుగా బిజెపి నాయకులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గ్రామ శివారులో పరిశీలించారు. అనంతరం పోచారం గ్రామంలోగల రామాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డికి సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా ఇరువురిని గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జానకంపేట్, జమలం గ్రామాల సర్పంచులు సాయిలు, గొడుగు రాజ్యలక్ష్మి హనుమంతు, పోచారం గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థిని

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మందర్న గ్రామానికి చెందిన గోనేవార్ ప్రియాంక హూన్స గ్రామంలో పదవ తరగతిని పూర్తిచేసుకుంది. అనంతరం ఇంటర్మీడియట్ విద్య కోసం దరఖాస్తు చేసుకోగా కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు ఉచితంగా చదువుకోవడానికి ఎంపికైంది. దాంతో విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. విద్యార్థి ప్రతిభను గుర్తించిన గ్రామస్తులు ఆదివారం గ్రామపంచాయతీలో సర్పంచ్ రావుబా గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలోని విద్యార్థులు ఇలాంటి ప్రతిభగల విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని సర్పంచ్ సూచించారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు ఇంటర్, ఎంసెట్, నీట్ కోచింగ్‌తో సహా మొత్తం ఖర్చులు దాదాపు 2 లక్షల రూపాయలు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బిర్లా విట్టల్ , చండోల్ సురేష్, గ్రామ పెద్దలు విశ్వనాథ్ పటేల్, కొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న గ్రామ సర్పంచ్

డీకే అరుణను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆర్మూర్ మీదుగా వేల్పూర్ మండలానికి వెళ్తుండగా పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమెను సన్మానించినారు. బీజేపీ నాయకుడు పైడి రాకేష్ రెడ్డి నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నుతుల శ్రీనివాస్, పెద్దోళ్ల గంగారెడ్డి, పల్లె గంగారెడ్డి తో కలిసిస్వాగతం పలికారు. వేల్పూర్‌లో వరద ధాటికి దెబ్బతిన్న పంటలను, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ గతంలో పంట నష్టానికి ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితం చేశారని ఇంతనష్టం వాటిల్లిన కేసీఆర్, కేటీఆర్ ప్రగతి భవన్ దాటి రావడం లేదని అన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించని అసమర్థ ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో బాల్కొండ అసెంబ్లీ ఇంచార్జి మలికార్జున్ రెడ్డి ,బస్వనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం పూజారి గది నిర్మాణానికి ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి తనవంతుగా పదివేల రూపాయల ను ఆదివారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ అభయ ఆంజనేయ దేవాలయం లో ఉన్న పూజారి కి గదిలేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు తెలుపగా తనవంతుగా విరాళం అందజేసినట్లు భక్తులు తెలిపారు. ఆయన ప్రత్యేక్క కృతజ్ఞతలు తెలిపారు.

అంతరాష్ట్ర రహదారికి మరమ్మతులు

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ - బోధన్


మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

భారీ వర్షాల కారణంగా, ఓవర్ లోడ్ ఇసుక వాహనాలతో నాగన్‌పల్లి గ్రామం వద్ద అంతరాష్ట్ర రహదారి గుంతల మయంగా మారింది. ఈ అంతరాష్ట్ర రహదారిపై వాహనాలు తిరగడానికి తీవ్ర ఇబ్బందులు కలగడం, అలాగే భారీ వర్షాల కారణంగా గుంతలలో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారడంతో 'గుంతల మయమైన అంతర్ రాష్ట్ర రహదారి' అంటూ గత వారం క్రితం నవ తెలంగాణ దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దాంతో స్పందించిన అధికారులు శనివారం నుండి మంత్రి మైసమ్మ ఆలయం సమీపం నుంచి నాగన్ పల్లి వరకు గుంతలు పూడుస్తూ మరమ్మతులు చేపట్టారు. మరమ్మతు పనులను నామమాత్రంగా కాకుండా నాణ్యతగా పనులు చేపట్టి గుంతలు పూర్తిగా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-ఎడపల్లి

లయన్స్ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ బాబురావు జన్మదినర సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో ఆదివారం ప్రతినిధులు మొక్కలు నాటారు. చిన్నారులు, యువకులకు పండ్లు, బిస్కెట్లు పంచారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కోశాధికారి కరటూరి సూర్యనారాయణ, ఎడపల్లి అధ్యక్షులు మెర్సి, ప్రధాన కార్యదర్శి కదం ప్రకాష్ రావు, కోశాధికారి బంద్ శంకర్, ప్రతినిధులు గంగారెడ్డి, కోఆర్డినేటర్స్ వర్మ, మనోజ్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

భారీ వర్షాల వల్ల మండలకేంద్రంలో నిరాశ్రయులైన పేదవారికి కాంగ్రేస్ నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి సూచనల మేరకు ఆదివారం కాంగ్రేస్ నాయకులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్,బెజ్జారం భాను,ముస్కు మోహన్,జింక అనిల్, గడ్డం జీవన్, కల్లెడ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యార్థి కథనభేరిని విజయవంతం చేయాలి : ఏబీవీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ విద్యార్థులను, ప్రజానీకాన్ని, నిరుద్యోగులని మేలు కొలుపుతూ ఆగస్టు ఒకటిన హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న తెలంగాణ విద్యార్థి కథన బేరి విజయవంతం చేసి తెలంగాణ రాష్ట్ర మార్పు కోసం మహా ఉద్యమంలో ఏకం కావాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చనబోయిన శివ అన్నారు. ఆదివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని విధ్వంసం చేసిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ కు దక్కుతుందని అన్నారు. విద్యారంగానికి నిధులు కేటాయించకుండా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థులను, నిరుద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నారని తెలిపారు. డిగ్రీ, పీజీ ఫీజులను అమాంతం పెంచి పేద ప్రజలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని వివరించారు. సుమారుగా 5300 కోట్ల ఉపకార వేతనాలను పెండింగ్లో పెట్టారన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ కొత్తలో విద్యా రంగానికి 11శాతం నిధులు కేటాయించగా ఈసారి కేవలం 6 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబ కబంధహస్తాలలో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులను ప్రజానీకాన్ని నిరుద్యోగులని మేలుకొలుపుతూ నిర్వహిస్తున్న కథన బేరి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నవీన్, సాయికుమార్, సాయి కృష్ణ, ప్రమోద్, రోహిత్, ప్రసాద్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నందిపేట్


బొకేను అందజేస్తున్న నాయకులు

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా హైదరాబాదులోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. మండల కేంద్రంలో చేపడుతున్న కళ్యాణ మండపాలకు మరిన్ని నిధులు మంజూరు చేసి, పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ముఖ్యంగా ఎస్సీ కళ్యాణ మండపం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వెల్మల్ రాజన్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అన్ని కులాల కు సంబంధించిన కళ్యాణ మండపం పనులు చురుగ్గా కొనసాగేందుకు కృషి చేస్తానని, కళ్యాణ మండపాలకు సరిపడా మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెల్మల్ రాజన్న,ఆర్మూర్ నియోజకవర్గ కుర్మా అధ్యక్షుడు కేజీ సురేష్, మోహన్, శ్రీదర్, బట్టు -కష్ణ తదితరులు ఉన్నారు.